# దారుణం



ముళ్ళపూడి నాగేశ్వరరావు

ట్రింగ్ ట్రింగ్ టెలిఫోన్ మోగుతోంది.

ఆగదిలో అరగంట నుంచి ఉన్న నిశ్శబ్దాన్ని భంగ పరుస్తూ.

నేను వాణికేసి చూశాను. ఆమె నాకేసి చూస్తోంది. ఆ చూపుల్లో భావాన్ని నా కళ్ళు చదవగలవు.

"హలో దిసిజ మధూ" అన్నాను టెలిఫోన్ ఎత్తి.

"హలో గుడీవెనింగ్ డాక్టర్" రాజారావు గొంతుక బొంగురుగా పలికింది. అతని గొంతుక అంతకు ముందు వినకపోతే ఎవరేనా అది టెలి ఫోన్ ఫాల్ట్ అనుకుంటారు. రాజారావు జైలు సూప రింటెండెంట్.

"గుడీవెనింగ్"

"గుర్తు పట్టారా నన్ను?"

"ఆ"

"ఇలా రాత్రి పూట మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నందుకు క్షమించాలి."

"ఫరవాలేదు—డాక్టర్లకు రాత్రి పగలు తేడా ఉండదు"

బహుశా అతను అవతలి పక్క నవ్వి ఉంటాడు. ఇవతలి పక్క గురగురమంది.

"గంగులు గుర్తున్నాడా మీకు"

"నా ఫ్రెండ్సుండగా నాకు జ్ఞాపకశక్తి ఎక్కువంటారు"

"గంగులికి ఉరి శిక్ష వేశారు" వాళ్ళావిడకి తలనొప్పి వచ్చిందన్నట్లు చెప్పాడు.

"అవును. సిస్టర్ శాంతి—చెప్పింది"

"ఆవిడెవరు?"

"నా కావేళ ఆపరేషన్‌లో అసిస్ట్ చేసింది."

కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

"గంగుల్ని ఎల్లుండి ఉరి తీస్తారు. అతని చివరి కోరికేమిటో తెలుసా"

"ఏమిటి?"

"మిమ్మల్ని చూడాలట"

"ఎవరు ఫోన్ చేస్తున్నారు?" మూడవ సారి అడిగింది వాణి.

"రేపు మీకు ఏ టైములో వీలవుతుంది?"

"రేపు వీలవదు. నా ఫ్రెండొకడు వస్తున్నాడు"

"అలాకాదు. మీరు వీలు చేసుకోవాలి. ఎల్లుండి గంగులుండడు."

ఒక క్షణం ఆలోచించాను.

"రేపు రాత్రి తొమ్మిదిన్నరకి"

"జైలుకొస్తారా?"

"ఊ!"

"గుడ్‌నైట్"

"గుడ్‌నైట్"

"ఎవరది రాత్రి తొమ్మిదిన్నరకి వస్తానంటున్నారు." వాణి గొంతుకలో ఆత్రుత, చిరాకు, అనుమానం అన్నీ ఉన్నాయి.

* * *

వర్షం కురుస్తోంది. వానపడుతోంది. రెండూ ఒకటే! కాని రెండిటిలో ఏదో తేడా ఉంది.

వైపర్స్ అద్దం మీద మంచి నీటిని తుడిచి వెయ్యడానికి ప్రయత్నిస్తున్నాయి. కాని అద్దం మీద నీటి బిందువులు మళ్ళీ చేరుతున్నాయి.

వైపర్స్ మళ్ళీ తుడుస్తున్నాయి. వైపర్స్, వర్షపు బిందువులు రెండు పోటీ పడుతున్నాయి.

గంగుల్ని ఊహించడానికి ప్రయత్నిస్తున్నాను.

ఆపరేషన్ థియేటర్‌లో—టేబిల్ మీద స్పృహ లేకుండా పడి ఉన్న గంగులు నా ఊహా పథంలో కదులుతున్నాడు.

గంగులు నక్సలైటు. చాలాటి మనుషుల్ని చంపి కొత్త రాజ్యాన్ని స్థాపించాలని కోరే వ్యక్తి. వీలైతే నా కంటంలో, నా గుండెల్లో, నా శరీరంలో ప్రతి భాగంలోను తన కత్తుల్ని దింపి నా రక్తంలో కొత్త రాజ్యానికి పునాదులు వేద్దామని భావించే వ్యక్తి.

కాని నేను పదునైన నా కత్తితో అతని ఎబ్డామెన్ ఓపెన్ చేసి అందులో ఉన్న బుల్లెట్‌ని బయటకు తీశాను.

"ఫోర్‌సెప్స్ స్ట్రెయిట్ నీడిల్"

నా నోట్లోంచి వస్తున్న మాటల్ని ఆకుపచ్చ మాస్క్ అడ్డేస్తుంది.

"అవును డాక్టర్! మీరెప్పుడింత కష్టపడి అతన్ని బతికించడమెందుకు. రేపు పోలీసులెలాగైనా అతన్ని ఉరితీస్తారు. అతని మీద ఆరు హత్య కేసులున్నాయి"

అవును ఎందుకు బతికించాలి. ఒక మేనస్తున్నే తనంత తానుగా చావనివ్వకూడదా? ఉరిశిక్ష తప్పదని తెలుసుకున్నప్పుడు కూడా ఎందుకు బతికించాలి. జవాబు లేకుండా నా మెదడలో తిరుగాడే వెయ్యి వొక్క ప్రశ్నల్లో అదొకటి.

"అబ్బ ఎంత బ్లీడ్ అవుతూందో!" ఆశ్చర్యం భయం ఆమె కంఠంలో. రక్తం, రక్తం! చిక్కటి ఎర్రటి రక్తం. నా తెల్లటి ఎప్రాన్ నిండా రక్తపు మచ్చలు. నా గుండెల్లో కనిపించకుండా ఉన్నన్ని మచ్చలు.

• • •

గంగులు ఆగదిలోకి వచ్చాడు. నమస్తే చేతులు జోడించాడు. అతనికి దాదాపు పలభై ఏళ్ళుంటాయి.

ఎదురుగుండా కుర్చీలో కూర్చుమన్నాను.

ముందర ఆలోచించాడు తరువాత కూర్చున్నాడు.

"నేను మీకు గుర్తున్నానా బాబూ"

"ఆ"

కొంచెం సేపు నిశ్శబ్దం.

"నన్ను రేపు ఉరి తీస్తున్నారు" అతని గొంతుక వణకలేదు. ఆ మాటని బహుశా అతను ఉదయం నించి చాలాసార్లు అనుకుని ఉంటాడు.

"నేను నక్సలైటుని"

నేను మాట్లాడలేదు. అతను నాతో ఏదో చెప్ప బోతున్నాడు. అందుకే నేను మాట్లాడలేదు.

"నేను ఆరు హత్యలు చేశాను. నా చేతిలో ఆరుగురు ప్రాణాలు విడిచారు. వాళ్ళలాగే నేను కూడా రేపు చచ్చిపోతున్నాను" అతను ఆగాడు.

అవును. ఎల్లుండి ఉదయం అతనికి సూర్యుడు ఉదయించడు.

"నాగురించి ఏడ్చేవాళ్ళులేరు. సహచరులు నా మరణవార్త విని బహుశా భయపడతారు కాని విచారించరు. ఏదో ఒక రోజు నా గతే వాళ్ళకు పడుతుందేమోనని వాళ్ళ భయం."

అంత వరకు నిశ్చలంగా ఉన్న అతని కంఠం మారింది. కొద్దిగా వణికింది. జీర బోయింది. "డాక్టర్! మీరు నాకు గొప్ప సహాయం చేశారు. ఆ రోజే ఆ బుల్లెట్ వల్ల నేను చచ్చిపోయుంటే నేను జీవితం గురించి లోకం గురించి అనేక ముఖ్యమైన విషయాల్ని తెలుసుకోకుండానే ఈ లోకం దాటిపోయేవాణ్ణి. కాని మీరు నా ఆయుష్షుని పొడిగించారు. నేను జైలుకు వచ్చి రేపటికి పధ్నాలుగు నెలల ఇరవై మూడు రోజులవుతుంది. ఈ సమయంలో నేను చాలా నేర్చుకున్నాను."

హఠాత్తుగా అడిగాడతను "డాక్టర్! మీరు మార్క్సిస్టా."

"కాదు."

"నా అసలు పేరు నారాయణ. స్కూలు ఫైనల్ దాకా చదివాను. అసలు నేను నక్సలైటు ఎందుకయ్యానంటే" . . .

"వద్దు చెప్పొద్దు" అతని మాటకు మధ్యలోనే అడ్డుపడ్డాను. అతను అదోలా చూశాడు.

"డాక్టర్ ఇప్పుడు నాదొకటేబాధ. మీ ఋణం తీర్చుకుండా వెళ్ళిపోతున్నానే అని."

అతని మాటలు నాకసహజంగా అనిపించాయి, కాని అతని ముఖంలో సిన్సియారిటీ ఉంది. కొట్టొచ్చినట్టు కనబడుతుంది.

"మీరు నాకేం ఋణ పడిలేరు. అది నా విధి. గవర్నమెంటు నాకు జీతం ఇస్తుంది'

అతను చిన్నగా నిట్టూర్చాడు.

మీకు శివరావు గారికి నేను నిజంగా ఋణపడి ఉన్నాను. శివరావు గారి గురించి మీకు తెలియదు కదూ. శివరావుగారు మహా మేధావి. నా జీవితంలో కొత్త కొత్త ద్వారాలు తెరిచి కొత్త లోకాన్ని చూపించింది.; జీవితానికి సరైన అర్థాన్ని చెప్పింది ఆయనే. జీవితం అంటే, తినడం, పడుకోవడం తిండికోసం కష్టపడ్డమే కాకుండా ఇంకేదో ఉందని స్ఫురింప చేసింది ఆయనే . . . . నారాయణ ఉద్రేకంగా చెప్పుకుపోతున్నాడు. ఒకప్పుడు నక్సలైటుగా ఉన్న ఆవేశం ఇంకా అతనిలో మిగిలి ఉందనిపించింది

శివరావు గారు నాతోటి ఖైదీ. నా గురువు. ఆయన జైలు శిక్ష పధ్నాలుగు సంవత్సరాలు నాలుగు సంవత్సరాలు గడిచింది. ఆయన నాలాంటి కిరాతకుడు కాదు. చాలా మంచివాడు కాని దురదృష్టకరమైన క్షణంలో ఆవేశంలో చేసిన పనికి అన్యాయంగా శిక్ష అనుభవిస్తున్నాడు. ఏదో విషయం మీద కోపం వచ్చి భార్య మీద కత్తి విసిరాడు. అది ఆవిడకి గుండెల్లో గుచ్చుకుని ఆవిడ చచ్చిపోయింది. ఈయనకు జైలు శిక్షపడింది" అతను ఆగాడు.

అతను ఆలోచనలో పడిపోయాడు. ప్రతి వ్యక్తిలోను ఎప్పుడో విచిత్రమైన మార్పు వస్తుంది. దాన్ని జ్ఞానోదయం అనొచ్చో లేదో కాని అది మనిషి జీవితాన్ని అనుకోని దిక్కులకి తిప్పడానికి ప్రయత్నిస్తుంది. కొందరు దానికి లొంగిపోతారు. కొందరు దాన్ని అణగదీసుకుంటారు.

నాకిప్పుడు బయట సమాజంలోకి వచ్చి మామూలు మనిషిగా జీవించాలని ఉంది కాని అది వీలవదు. కనీసం నాకింకా బతకాలని ఉంది. కష్టాలు పడుతూ అయినా కాని అది వీలవదు' రేపు ఉరితాడు నా మీద చుట్టూ బిగుసుకుంటుంది సమాజం పీకకి చుట్టుకుంటున్న ఉరితాడుని విప్పబోయి దాన్ని నా మెడకే తగిలించుకున్నాను"

అతనింకా అదే ధోరణిలో మాట్లాడుతున్నాడు. నేను కాని అదేదే స్థితిలో ఉంటె నా మనస్థితి ఎలా ఉంటుందో అని ఆలోచిస్తున్నాను.

"ఒక్క క్షణం అనిపిస్తుంది ఏదో విచిత్రం జరుగుతుందనీ నా ఉరిశిక్ష రద్దవుతుందనీ కాని మరు క్షణం గ్రహిస్తాను అది అత్యాశ అని"

మళ్ళీ మామధ్య నిశ్శబ్దం పరచుకుంది. అది అలా అలా సాగి చటుక్కున తెగిపోయింది.

"డాక్టర్! నాకు మీ గురించి తెలుసుకోవాలని

MSCO క్రైమ్ సీరీస్ బుక్స్

# యద్దనపూడి సులోచనారాణి

1978 నవల అభిశాపం వెల: రూ.10

1979 నవల గిరిజాకళ్యాణం రూ.12




ఈ యిద్దరిలో ఎవరి అభిప్రాయం నిజమో తెలుసుకోవాలంటే రెండూ చదవండి! మీ దగ్గరలో వున్న బుక్‌షాప్‌లో గాని, పత్రికలు అమ్మే న్యూస్ ఏజంట్‌ని గాని అడగండి. వారి వద్ద లేవంటే తెప్పించి పెట్టమనండి. అదీ వీలుకాదంటే సరాసరి మాకు రాయండి! మీకు కావలసిన పుస్తకాల ఖరీదులో 2 రూపాయలు తగ్గించి పైకం ముందుగా M.O. ద్వారా పంపండి. ఆ 2 రూపాయలకు వి.పి.పెట్టి పోస్టు ఖర్చులు మేమే భరించి రిజిష్టర్డ్ పోస్టులో పంపుతాం!

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్

3237, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-500 003

ఉంది. మీ గురించి చెప్పండి" త్వరత్వరగా అన్నాడతను.

"ఏం చెప్పను"

"మీ గురించి వివరాలు.నా జీవితానికి బహుశా ఇదే చివరి పరిచయం.నా మెదడు బహుశా ఈ విషయాలే గుర్తు పెట్టుకోవడానికి చివరిసారిగా ప్రయత్నిస్తుంది."

నేను మాట్లాడలేదు.

అతనే మళ్ళీ అన్నాడు "చిత్రంగా లేదూ మరో ఇరవై నాలుగు గంటల్లో నా శరీరంలో ప్రతి కణం చచ్చిపోతుంది. ఈ ప్రపంచంతో సంబంధం ఉండదు. కాని ఈ లోపల మీ గురించి తెలుసుకోవాలని తహ తహ లాడుతున్నాను"

"డాక్టర్ మీ దే వూరు"

"ఈ వూరే"

"ఇప్పుడుకాదు చిన్నప్పుడు. మీరు పెరిగినవూరు చెప్పాను.

"ఆ వూరా?" ఆశ్చర్యంగా అన్నాడతను. "మీకయితే నరసింహం తెలుసా?"

"ఏ నరసింహం"

"కె. నరసింహం చాలా డబ్బున్నవాడు"

"తెలుసు"

"ఎలా . తెలుసు"

"అతను మా మావయ్య"

"ఆఁ! నిజం?"

"నిజం! మా అమ్మ తమ్ముడు. అతని దగ్గరే నేను పెరిగింది"

"అతను ఎలా చచ్చిపోయాడో తెలుసా మీకు"

"తెలుసు. నక్సలైట్లు చంపేసారని విన్నాను"

"అవును. అయన్ని చంపి వాళ్ళిళ్ళ దోచుకున్నది నేనే"

నేను మాట్లాడలేదు.

"డాక్టర్ నన్ను క్షమించండి. మీకు గొప్ప అపకారం చేశాను"

అతను షాక్ అయ్యాడు. ఆ షాక్ నుంచి తేరుకోవ డానికి కొంత టైము అవసరం.

"నేనింక వెడతాను" నేను కూర్చీలోంచి లేచాను. చెయ్యి ముందుకి చాచాను. ఎప్పుడూ నా నాలుక చివర ఉండే మాట.

"సీయూ ఎగైన్" బయటకు రాబోయి ఆగి పోయింది.

అతను తన రెండు చేతులలో నా చేతిని అందు కున్నాడు.

"డాక్టరు మీ రుణాన్ని నేను తీర్చుకోలేను. మళ్ళీ జన్మంటు ఉంటే . . ." అతని గొంతు పూడుకుపోయింది.

నేను బయటకు నడిచాను.

వర్షం ఇంకా పడుతూంది. టప టప . . . కళ్ళద్దాల మీద పడుతున్నాయి వర్షపు చినుకులు

"బావా! వర్షం కురిస్తే కొందరికి జలుబు చేస్తుంది. కొందరికి జ్వరం వస్తుంది. కాని నీ కళ్ళు కనిపించవు" కమల మాటలు ఎక్కడినుంచో విని పిస్తున్నాయి.

"నీ కళ్ళద్దాల మీద నీళ్ళు పడతాయి కాబట్టి" కమల నవ్వు గుర్తుకొస్తూంది.

కమలా, కమలా, హృదయం సన్నగా మూలిగింది కమల ఇపుడేంచేస్తూ ఉంటుంది.

ఏ టెలివిజన్ చూస్తూనో, టటి ఆడుతూనో ఉంటుంది ఆమె ఎక్కడో కాలి ఫోర్నియాలో— తను ఇక్కడ, ఇక్కడే

కారు దగ్గర నడిచేటప్పటికి పూర్తిగా తడిశాను రెయిన్‌కోటు లోపల మర్చిపోయాను ఎందుకో వెళ్ళి తీసుకోవాలనిపించలేదు రాజారావు రేపేలాగా ఇంటికి పంపుతాడు

వాణి ఏమంటుందో?

డాక్టరు నీతులు చెబుతుంది నాకు.

యథా ప్రకారం వైపర్స్, వర్షపు బిందువులు పోటీ పడుతున్నాయి..

కారు కెదురుగా ఎవరో అమ్మాయి, అబ్బాయి వస్తున్నారు. ఇద్దరూ తడిసి పోయి ఉన్నారు ఆ అమ్మాయి ఆ అబ్బాయిని జబ్బట్టుకుని రోడ్డు మీంచి ఫుట్‌పాత్ మీదకు లాగుతూంది.

"బావా! తొమ్మిదయినా అలా వర్షం కేసి చూస్తూ పడుకున్నావేమిటి? లేలే"

"కమలా నీకేసి వర్షం కేసి మార్చి మార్చి చూస్తూ జీవితమంతా గడిపెయ్యాలని ఉంది."

"కవిత్వం చెప్పకు లే"

"నిజం కమలా! ఇలాటి వర్షాకాలపు ఉదయాలు నీ ఒళ్ళో తలపెట్టుకు తిలక్ కవిత్వం చదువుతూ సుశీల పాట వింటూ గడిపెయ్యాలని ఉంది.

"అబ్బ ఎన్ని కోరికలో"

"ఏం కమలా! నేనంటే నీ కిష్టం లేదా?"

"అది నీకు తెలియదా?"

"నాకు తెలియదు. చెప్పు కమలా"

"బావా! నా గుండెల దగ్గర నీ చెవి పెట్టి విను. ఎప్పుడూ నీ పేరే వినిపిస్తుంది"

కారుకి మళ్ళీ ఎవరో అడ్డొస్తున్నారు హారన్ కొట్టాలి. కాని కాని కొట్ట బుద్ధి కావటం లేదు.

నాలుగోసంవత్సరంపరీక్షలు రాసి ఇంటికెళ్ళినప్పుడు కమల అడిగింది. "బావా! నన్ను విడిచి నువ్వు బతక గలవా?"

"అదేం ప్రశ్న కమలా?"

"అవును బావా! మరో రెండు నెలల్లో నేను కాలిఫోర్నియాలోను, నువ్వు కింగ్ జార్జి హాస్పటల్లోను ఉంటాం"

ఆమె కళ్ళల్లో కన్నీళ్ళు.

ఆమె చెక్కిలిపై కన్నీళ్ళు.

ఆమె గొంతుకలో, ఆమె హృదయంలో, నరనరం లోను బాధ. "కమలా! నే మరువలేను." గొంతులోంచి మాట పెగల్లేదు. "ఏమిటిది కమలా" చివరికి అన్నాను.

"మళ్ళీ నెల ఇరవ యొకటో తారఖున నా పెళ్ళి. పెళ్ళికొడుకు కాలిఫోర్నియోలో ఉన్నాడు"

"ఎవరు చెప్పారు?"

"నాన్న. నీకు తెలుసు. నాన్నని నేను ఎదిరించ లేనని."

డామిట్! చేతులు స్టీరింగ్ చుట్టూ బిగుసు కున్నాయి. ఎదురుకుండా ఒంటికన్ను రాక్షసుడిలా వస్తుంది లారీ.

ఎక్కడో మెరుపుకీ మధ్య ఉరుము ఉరుముకీ మధ్య మెరుపు. వర్షం కురుస్తూంది. వాన పడుతుంది. కారు నడుస్తూంది.

"అవును అది నిజం. కమల పెళ్ళి మురళి కృష్ణ తోటి నిశ్చయం అయిపోయింది.

"మావయ్యా!"

"ఎందుకలా అరుస్తావ్?"

"ఇది అన్యాయం"

"ఏమిటి అన్యాయం. తండ్రిలేని నిన్ను పెంచటం నీకు డాక్టరు చెప్పించడం ఇవేనా అన్యాయం."

"మావయ్యా! నీకు తెలుసు కమలకీ నాకు మధ్య నున్న స్నేహం"

"పాత స్నేహాలకంటే కొత్త స్నేహాలే బాగుం టాయి."

"మావయ్య ఈ పెళ్ళి జరగటానికి వీలులేదు."

"నువ్వెవడివోయ్ చెప్పడానికి, అప్రాచ్యపు గాడిద, అణాకానికీ, పనికిరావు నీకు నాకూతురి నివ్వాలా? గెటవుట్ లేక పోతే గెంటించవలసి వస్తూంది"

"మావయ్య"

"ఐ సే గెటవుట్"

కారు "వాణి మహల్" దగ్గర కొచ్చింది. హారన్ మీదకు చెయ్యి పోబోతూంటే చూశాను. వాణి గేటు తీసుకుని బయటకు వస్తూంది.

"చలపతి ఫోన్ చేశారు. ఏదో ఎమర్జన్సీ కేసుం దిట నర్సింగ్ హోమ్‌కి రమ్మన్నారు."

టైము పదీ నలభై ఐదయ్యింది. ఎందుకో ఆక్షణం కారులో కాకుండా పడవలో పోతున్నట్లుగా అనిపించింది.

నా జీవితంలో ఆ దురదృష్టకరమైన సంఘటన జరగి ఉండకపోతే నేను మనుషులు హత్యలు ఎందుకు చేస్తారో ఎప్పుడు సరిగ్గా అర్థం చేసుకుని ఉండే వాణ్ణి కాదేమో.

ఆరోజు రాత్రి—కమల పెళ్ళిరోజు రాత్రి గుండెల్లో ఒకటేమంట.

కోపం, ఆవేశం కలిసి ఒకటే కోర్కెను రేపాయి. చంపాలి. మావయ్యను చంపాలి!! కత్తితో అరవై పోట్లు పొడిచి చంపాలి.

జేబులో కత్తి వేసుకుని, కాళ్ళకు జోళ్ళను వేసుకుని— ఆగిపోయాను.

చట్టానికి భయపడో.

నాలో అంత ధైర్యం లేకో.

లేక మరేదో ఆలోచించో.

ఆగిపోయాను.

తరవాత నాలుగేళ్ళకి మావయ్య మరణవార్త విన్నప్పుడు నిర్లిప్తంగా ఉండిపోయాను.

ఎవరు ఎవరికి రుణపడి ఉన్నారు?

నేనా? అతనా?

అతని రుణాన్ని నేను తీర్చేనా?

కారు 'చలపతి నర్సింగ్ హోమ్' ముందాగింది.